

హైదరాబాద్ వార్త

## చదువుతో పాటు క్రీడల పట్ల యువత దృష్టి పెట్టాలి : మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

**సంజీవరెడ్డి నగర్, డిసెంబర్ 29, ప్రభాతవార్త**

చదువుతో పాటు క్రీడలపట్ల యువత దృష్టి పెట్టాలని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ పిలుపునిచ్చారు. గురువారం అమీర్‌పేటలోని మున్సిపల్ గ్రౌండ్‌లో మూడు రోజుల పాటు నిర్వహించే తలసాని ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌ను మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలలో పాల్గొనడం వలన ఆరోగ్యవంతంగా, దృఢంగా ఉంటారని అన్నారు. దేశంలో అనేక క్రీడలలు ఉన్నప్పటికీ క్రికెట్‌కు అత్యధిక ఆదరణ ఉందని పేర్కొన్నారు. క్రీడలలో గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలని సూచించారు. ఈ పోటీలలో గెలుపొందిన విజేతలకు నగదు బహుమతితో పాటు మెమెంటోలను అందజేయనున్నట్లు మంత్రి ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, టిఆర్ఎస్ నాయకులు హన్మంతరావు, అశోక్‌యాదవ్, సంతోష్, గులాబ్‌సింగ్, సుమిత్‌సింగ్, కరుణాకర్‌రెడ్డి, చింటు, కుమార్, కార్తిక్ తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేషన్ అభివృద్ధిపై అధికారులతో ఎమ్మెల్యే సమీక్షా సమావేశం

**నిజాంపేట్, డిసెంబర్29 ప్రభాతవార్త:**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి కార్పొరేషన్ కార్యాలయంలో మేయర్ కొలన్ నీలాగోపాల్‌రెడ్డి, కార్పొరేటర్లు, ఎన్ఎంసీ కో-ఆప్షన్ సభ్యులు, అధికారులతో ఎమ్మెల్యే కెపి వివేకానంద్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మెరుగైన మౌళిక వసతుల కల్పనకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. డివిజన్‌లలోని కాలనీలు, బస్తీల్లో మంచినీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని, వాటర్ ట్యాంకుల నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. మంచినీటి పైపులైన్ల కనెక్షన్లు, నీటి సరఫరాలో అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని, రాబోయే ఎండా కాలంలో తాగునీటి సమస్యలను దృష్టిలో పెట్టుకొని ఎక్కడా సమస్యలు తలెత్తకుండా తగు చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వర్షాకాలంలో ముంపు ప్రాంతాల్లో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఎస్ఎన్‌డీపీ ఆధ్వర్యంలో చేపడుతున్న నాలా నిర్మాణా పనుల్లో వేగం పెంచాలని, డివిజన్‌లోని వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సమస్యలపై ప్రత్యేక దృషివహించి సమస్యను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్, కమిషన్ వంశీకృష్ణ, ఫ్లోర్ లీడర్ ఆగం పాండుముదిరాజ్, హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బి, ఎస్ఎన్‌డీపి, హెచ్ఎండీఏ, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

## శ్మశాన వాటికలో చెత్తను తొలగించిన కార్పొరేషన్ సిబ్బంది

### - మరుగుదొడ్లను కూడా మరమ్మతు చేస్తామన్న అధికారులు ( "వార్త ప్రభావం")

**నార్సింగి, డిసెంబర్ 29 ప్రభాతవార్త :**

"సమస్యల వలయంలో స్మశాన వాటిక" అన్న శీర్శికతో గురువారం వార్త పత్రికలో ప్రచురితమైన కథనంకు బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ కమీషనర్ వేణుగోపాల్‌రెడ్డి స్పందించారు. శానిటరీ సిబ్బందిని, జేసీబీని పంపించి స్మశాన వాటికలో ఉన్న చెత్తను మొత్తం తొలగింపచేశారు. ఇకపై ఇక్కడ చెత్త వేస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామని శానిటరీ సిబ్బంది స్థానికులను హెచ్చరించారు. ఇళ్లలోని చెత్తను ఆటోలలోనే వేయాలని, ఇలా స్మశాన వాటికలో, రోడ్లపై వేయడం చట్ట రిత్యా నేరమని తెలిపారు. చెత్తను స్మశాన వాటికలో వేస్తూ మాకు పట్టుబడితే భారీ ఎత్తున అపరాధ రుసుమును వసూలు చేస్తామని స్పష్టం చేశారు. ఈ స్మశాన వాటికను ఆనుకొని ఉన్న ఇళ్ల వారికి పరిశుభ్రతపై ప్రత్యేక అవగాహన కల్పించారు. చెత్త నిలువ ఉంటే ఈగలు, దోమలు వృద్ధి చెంది అంటు వ్యాధులైన డెంగ్యూ, చికెన్ గున్యా, బోధకాలు, మలేరియా, టైఫాయిడ్ వంటివి వ్యాపిస్తాయని సూచించారు. నిలువ ఉన్న చెత్త నుంచి వచ్చే దుర్వాసనతో అజీర్తి, శ్వాసకోశ వ్యాధులు వస్తాయని అవగాహన కల్పించారు. ఇక నుంచి తరుచూ ఈ స్మశాన వాటిక వద్ద చెత్తను తొలగిస్తామని శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేష్ తెలిపారు. త్వరలోనే మరుగుదొడ్లను కూడా ఆధునీకరిస్తామని, నీటి వసతిని కల్పించేందుకు కృషి చేస్తామని కమీషనర్ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు.



వార్త కథనంతో స్పందించి చెత్తను తొలగించిన కార్పోరేషన్ శానిటరీ సిబ్బంది దృశ్యం (గురువారం ఫోటో)

## చారిత్రక కట్టడాల పరిరక్షణ కోసం చర్యలు

### అర్వింద్ కుమార్



రాష్ట్ర పురపాలక అడి మ్ని స్ట్రేషన్ ముఖ్య కార్యదర్శి అర్వింద్ కుమార్ పాతబస్తీలోని బాద్‌షాహి అసుర్‌ఖానాను సందర్శించినప్పటి చిత్రం

**చార్మినార్, డిసెంబరు 29 ప్రభాతవార్త :**

పాతబస్తీలోని చారిత్రక కట్టడాల పరిరక్షణ కోసం ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర పురపాలక అడ్మినిస్ట్రేషన్ ముఖ్య కార్యదర్శి అర్వింద్ కుమార్ అన్నారు. పాతనగరం హుస్సేనీఆలంలో ఉన్న కుర్షిదాజా దేవిడి, మదీనా సమీపంలోని బాద్‌షాహి అసుర్‌ఖానాలను ఆయన గురువారం జిహెచ్ఎంసి, కుడా, పురావస్తు శాఖాధికారులతో కలిసి సందర్శించారు. చారిత్రక కట్టడాల మరమ్మతులు, అభివృద్ధి పనులపై ఆయన అధికారులతో కలిసి చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చారిత్రక కట్టడాల పరిరక్షణ కోసం తగు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. జిహెచ్ఎంసి చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ సామ్రాట్ అశోక్, చార్మినార్ సర్కిల్ డిఎంసి సూర్య కుమార్, కుడా డిప్యూటీ డైరెక్టర్ రాములు నాయక్, ఆర్కిటెక్చర్ సూర్య నారాయణ మూర్తి, రాష్ట్ర పురావస్తు శాఖ అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## టీడీపీ కార్వాన్ నియోజవర్గ ఇన్‌చార్జ్‌గా బండారి వెంకటేష్‌ను నియమించాలి



టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్‌కు వినతి పత్రం అందిస్తున్న ఏ.ఎస్.రావు.

**మెహిదీపట్నం, డిసెంబర్ 29, ప్రభాతవార్త :**

టీడీపీ కార్వాన్ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా బండారి వెంకటేష్‌ను నియమించాలని కోరుతూ ఆపార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ ఏ.ఎస్.రావు గురువారం రాష్ట్ర అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్‌ని కలిసి వినతి అందజేశారు. ఈ సందర్భంగా ఏ.ఎస్.రావు మాట్లాడుతూ.. కార్వాన్ నియోజకవర్గంలో టీడీపీ రోజు రోజుకు బలపడుతుందన్నారు. నియోజకవర్గానికి చెందిన బండారి వెంకటేష్‌ను ఇన్‌చార్జ్‌గా నియమిస్తే పార్టీ మరింత బలోపేతమవుతుందన్నారు. రానున్న రోజుల్లో నియోజకవర్గంలోని అన్ని డివిజన్‌లలో పర్యటిస్తూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేయడంతో పాటు కార్యకర్తలకు మనోధైర్యాన్ని కల్పిస్తామని తెలిపారు. అనంతరం కాసాని జ్ఞానేశ్వర్, బండారి వెంకటేష్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు.

## రాష్ట్రపతిని కలవనున్న సేంద్రియ వ్యవసాయ పితామహుడు పద్మశ్రీ చింతల వెంకటరెడ్డి

### - రాష్ట్రపతి నిలయంలో మధ్యాహ్న భోజనానికి అందిన ఆహ్వానం

**అల్వాల్, డిసెంబరు 29 ప్రభాతవార్త:** సేంద్రీయ వ్యవసాయ రంగంలో దేశానికి ఆదర్శవంతమైన రైతుగా నిలిచారు. గత ఏడాది ఆయన సేవలకు గాను కేంద్ర ప్రభత్వం పద్మశ్రీతో సత్కరించింది. అల్వాల్‌కు చెందిన చింతల వెంకటరెడ్డికి రాష్ట్రపతి నుంచి ఆహ్వానం అందింది. శీతాకాల విడిదిలో బాగంగా ప్రథమ పౌరురాలు బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో విడిది చేసిన విషయం తెలిసిందే. ఈ నెల 26న నగరానికి వచ్చిన ద్రౌపది ముర్ము 30వ తేది సాయంత్రం తిరిగి ఢిల్లీ వెళతారు. శుక్రవారం మధ్యాహ్నం రాష్ట్రపతి నిలయంలో వివిఐపిలకు ఇచ్చే భోజనానికి వెంకటరెడ్డికి ఆహ్వానం అందింది.



తెలంగాణ సాహిత్య అకాడమి రూపొందించిన నూతన సంవత్సరం క్యాలెండర్‌ను రాష్ట్ర విద్యా శాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి ఆవిష్కరించారు. చిత్రంలో అకాడమి ఛైర్మన్ జూలూరి గౌరీశంకర్, విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ, విద్యా శాఖ కార్యదర్శి నవీన్ మిట్టల్ ఉన్నారు.

## భారత దేశ సమాఖ్య విధానాన్ని విచ్ఛిన్నం చేస్తే తాట తీస్తాం

### -సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు అజీజ్‌పాషా హెచ్చరిక

**సైఫాబాద్, డిసెంబరు 29 ప్రభాతవార్త:**

ప్రజాస్వామ్యాన్ని పెంపొందిస్తున్న భారతదేశ సమాఖ్య విధానాన్ని విచ్ఛిన్నం చేస్తే తాట తీస్తామని సిపిఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్‌పాషా కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య విశ్వాసం దెబ్బతినేలా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాజ్‌భవన్‌లను దుర్వినియోగం చేస్తున్నదన్నారు. ప్రజల చేత ఎన్నుకున్న ప్రభుత్వాలను కూల్చివేయడం, ఎమ్మెల్యేలను కొనడం అడ్డదారిన ప్రభుత్వాలను ఏర్పాటు చేయడం వంటి ప్రజాస్వామ్య వ్యతిరేక విధానాలకు కేంద్రం పాల్పడుతున్నదని ఆయన ధ్వజమెత్తారు. ఫెడరలిజం రక్షించాలని సిపిఐ జాతీయ కమిటి ఇచ్చిన పిలుపు మేరకు దేశవ్యాప్త ప్రదర్శనల్లో భాగంగా గురువారం సిపిఐ హైదరాబాద్ జిల్లా ఆధ్వర్యంలో ట్యాంక్‌బండ్ వద్దగల డా.బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం వద్ద జరిగిన ప్రదర్శనలో ఆయన ప్రసంగించారు. రాజ్యాంగం ప్రకారం మనదేశం రాష్ట్రాల సమాఖ్య అని ప్రధాని మోదీ మరిచిపోయి వన్ నేషన్ పేరుతో శక్తివంతమైన ఫాసిస్టు రాజ్యాన్ని స్థాపించడానికి కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.ఎస్.బోస్ మాట్లాడుతూ గవర్నర్‌లు రాష్ట్ర ప్రభుత్వాల విధాన నిర్ణయాలపై బహిరంగ విమర్శలకు దిగుతున్నారని, చట్ట సభలు ఆమోదించిన బిల్లులపై సంతకాలు చేయడానికి నిరాకరిస్తూ రాష్ట్రాల అభివృద్ధి కార్యక్రమాలను అడ్డుకుంటున్నారని ధ్వజమెత్తారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఇ.టి.నర్సింహ్మ మాట్లాడుతూ రాజ్‌భవన్‌లను గవర్నర్‌లు బిజెపి కార్యాలయాలుగా మార్చివేశారని ఆరోపించారు. గవర్నర్‌ల దుర్వినియోగాలను అరికట్టడానికి పోరాటాలు చేయాలని సూచించారు. దేశంలో సమాఖ్య వ్యవస్థను బలోపేతం చేయడానికి ప్రగతిశీల ప్రజాస్వామ్యవాదులందరూ ఏకం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఉజ్జని రత్నాకర్‌రావు, పి.ప్రేమ్‌పావని, ఎస్.ఛాయాదేవి, స్టాలిన్, ఆర్.శంకర్‌నాయక్, కమతం యాదగిరి, పడాల నళిని, నెర్లకంటి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. ప్రదర్శనలో కార్యకర్తలు నల్ల టీషర్టులు, మహిళలు నల్ల చీరెలు ధరించి పాల్గొన్నారు.





అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న సిపిఐ కార్యకర్తలు

## 1న 'తానా బహుజన కళామహోత్సవాలు-2023'

### -వకుళాభరణం కృష్ణమోహన్‌రావుకు 'బహుజన బంధు అవార్డు' ప్రదానం

**సైఫాబాద్, డిసెంబరు 29 ప్రభాతవార్త:**

నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని జనవరి 1వ తేదీన రవీంద్ర భారతిలో 'బహుజన కళామహోత్సవాలు-2023' పేరిట అంగరంగ వైభవంగా వైవిధ్యం, విశిష్యం కలిగిన సంప్రదాయ బహుజన సాంస్కృతిక కళా ప్రదర్శనలు నిర్వహిస్తున్నామని తానా ప్రపంచ తెలుగు సాహిత్య వేదిక అధ్యక్షుడు తోటకూర ప్రసాద్, తారా ఆర్ట్స్ అకాడమి అధ్యక్షుడు సంకె రాజేష్ తెలిపారు. గురువారం రవీంద్రభారతిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు ఈ కళామహోత్సవాలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌లను ఆవిష్కరించి మాట్లాడారు. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రముఖ బహుజన కళాబృందాలు ఈ కార్యక్రమంలో ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు పాల్గొంటాయన్నారు. తానా తొలిసారిగా సామాజిక దృక్పధంతో అన్ని వర్గాల కళాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో ఈ వైవిధ్యభరితమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఇందులో భాగంగా రాష్ట్ర బిసి కమిషన్ ఛైర్మన్ డా.వకుళాభరణం కృష్ణమోహనరావుకు 'బహుజన బంధు' పురస్కారాన్ని ప్రదానం చేస్తున్నామని, ఆయన ఉభయ తెలుగు రాష్ట్రాలలో మూడు దశాబ్దాలుగా విశేషంగా బిసి వర్గాల హక్కులు, ప్రయోజనాల సాధనకు నిరంతరం కృషి చేస్తూనే ఉన్నారని అన్ని కోణాలలో పరిశీలించిన దరిమిలా పురస్కారం జ్యూరీ కమిటీ ఈ అవార్డును కృష్ణమోహన్‌కు ఇవ్వాలని సూచించినట్లు వారు తెలిపారు. అలాగే బహుజన వర్గాల నుంచి వివిధ రంగాలలో 'పద్మశ్రీ' పురస్కారాలు అందుకున్న ప్రముఖులకు జ్ఞాపికలను అందజేసి ఘనంగా సత్కరించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక సారధి ఛైర్మన్ రసమయి బాలకిషన్, తానా అధ్యక్షుడు లావు అంజయ్యచౌదరి, రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ ముఖ్యఅతిథి కార్యదర్శి బుర్రా వెంకటేశం పాల్గొంటారని వారు వివరించారు.



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రసాద్, రాజేష్.

## సలావుద్దీన్ బాబా దర్గాను సందర్శించిన హోంశాఖ మంత్రి మహమూద్ ఆలీ



రాష్ట్రం హోంశాఖ మంత్రి మహమూద్ అలీ సలావుద్దీన్ బాబా దర్గాను సందర్శించిన దృశ్యం

**చార్మినార్, డిసెంబరు 29 ప్రభాతవార్త :**

రాష్ట్ర హోంశాఖ మంత్రి మహమూద్ అలీ గురువారం పాతబస్తీ కాలాఫత్తర్‌లోని సలావుద్దీన్ బాబా దర్గాను సందర్శించారు. దర్గాలో మంత్రిమహమూద్ అలీ ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం టిఆర్ఎస్ ఇంఛార్జి పుస్తె శ్రీకాంత్‌తో పాటు పలువురు పాల్గొన్నారు. హోంశాఖ మంత్రి మహమూద్ అలీ పాతబస్తీకి విచ్చేసిన సందర్భంగా కాలాఫత్తర్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ బుచ్చయ్య గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

## వీఎన్ఆర్‌వీజేఐఈటీ కళశాలలో గ్లోబల్ ఎడ్యుకేషన్ సెల్ ప్రారంభం



జి-సెల్‌ను ప్రారంభిస్తున్న సాంకేతిక విద్యా కమిషనర్ నవీన్ మిత్తల్

**నిజాంపేట్, డిసెంబర్29 ప్రభాతవార్త:**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని విఎన్ఆర్ విజ్ఞాన జ్యోతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో గ్లోబల్ ఎడ్యుకేషన్ సెల్‌ను ముఖ్య అతిథి సాంకేతిక విద్యా కమిషనర్ నవీన్ మిత్తల్ ప్రారంభించారు. అనంతరం నవీన్ మిత్తల్ మాట్లాడుతూ వీఎన్ఆర్‌వీజేఐఈటీ కళాశాల తమ విద్యార్థుల భవిష్యత్ పై తగిన సూచనలు, సలహాలు ఇచ్చి వెన్నుదన్నుగా నిలుస్తోందని కొనియాడారు. ప్రతి విద్యా సంస్థ జి-సెల్‌ను నిర్వహించి తమ విద్యార్థులకు చేయూతనివ్వాలని పిలుపునిచ్చారు. గత మూడేళ్ళుగా తన కార్యాలయం ద్వారా, జెఎన్‌టీయూ హైదరాబాద్ ద్వారా తగిన సహాయ సహకారాలందించి గ్లోబల్ ఎడ్యుకేషన్ అండ్ కెరియర్స్ ఫోరమ్(జిఈసీఎఫ్) పేరిట వివిధ కళాశాలల్లోని విద్యార్థులను ఒకే వేదిక పైకి తీసుకు వచ్చి విదేశీ ఉన్నత విద్యపై విశ్వసనీయ సమాచారాన్ని అందించే ఉద్దేశ్యంతో ముందుకు సాగుతున్నామన్నారు. అనంతరం కళాశాల గ్లోబల్ రిలేషన్‌షిప్ ఆఫీసర్ డా.కిరణ్ చక్రవర్తుల మాట్లాడుతూ తమ కళాశాలలో 2019 లోనే గ్లోబల్ రిలేషన్‌షిప్ కార్యాలయాన్ని నెలకొల్పామని, జీఈసీఎఫ్ వేదికతో ఉన్న అవగాహన ఒప్పందం మేరకు జి-సెల్‌ను ఏర్పాటు చేశామన్నారు. జీఈసీఎఫ్ కు, విదేశీ విద్యకు సంబంధించిన సమాచారాన్ని అందించటమే తమ లక్ష్యమని, నవీన్ మిత్తల్ సలహదారుడిగా వ్యవహరించడం వల్ల జీఈసీఎఫ్ వేదిక విజయవంతమైందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రధాన అధ్యాపకుడు డా.సి.డి.నాయుడు, సంచాలకులు డా.బి.చెన్నకేశవరావు, గ్లోబల్ రిలేషన్‌షిప్ ఆఫీసర్ డా.చక్రవర్తుల కిరణ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## లోకేష్‌ను కలిసిన టిటిడిపి రాష్ట్ర కార్యదర్శి సంతోష్ సాగర్

**అల్వాల్, డిసెంబరు 29 ప్రభాతవార్త:**

యువ గాలం పేరుతో తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ నిర్వహించనున్న పాదయాత్రకు తెలంగాణా టిడిపి నేతలు సంపూర్ణ మద్దతు తెలిపారు. టి టిడిపి రాష్ట్ర కార్యదర్శి సంతోష్ సాగర్ నేతృత్వంలో పలువురు నేతలు లోకేష్‌ను కలిసిన వారిలో ఉన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంతో పాటుగా తెలంగాణాలోని మూడు జిల్లాలుతో కలిపి మొత్తం 4వేలు కిలోమీటర్లు 400 రోజులు పాటు పాదయాత్ర చేయనున్నారు. పాదయాత్రకు సంబంధించి ఎటువంటి బాధ్యతలు అప్పగించినా తాము స్వీకరించడానికి సిద్దంగా ఉన్నామని సంతోష్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సందీప్ సాగర్ పాషా దర్శన్ రాము తదితరులు పాల్గొన్నారు.

## దొంగను ఎదిరించి మంగళసూత్రాన్ని దక్కించుకున్న మహిళ

**తార్నాక, డిసెంబర్ 29 ప్రభాతవార్త:**

ఓ మహిళ మెడలోని మంగళసూత్రాన్ని ఓ దొంగ తెంచుకొని పారిపోతుండగా కత్తిపోట్లతో బాదపడుతూ మంగళసూత్రాన్ని రక్షించుకొంది. సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి విచ్చింది. జీఆర్‌పీ పోలీసుల కథనం ప్రకారం. నిజామాబాద్ జిల్లా కెనాల్‌కట్ట ప్రాంతానికి చెందిన పోలు అశోక్(48) కనకలక్ష్మి(45) దంపతులు. ఇదిలా ఉండగా బోరబండలో ఉంటున్న బంధువు వారి బందువుల ఇంటికి వచ్చేందుకు రోటేగావ్ కాచిగూడ ఎక్స్‌ప్రెస్‌లో కాచిగూడకు వీరిద్దరు బయలుదేరారు. కగా సీతాఫల్‌మండి రైల్వే స్టేషన్ సమీపంలో సిగ్నల్ కోసం రైలు ఆగింది. ఎప్పటి నుంచో అదనుకోసం ఎదిరిచూస్తున్న గుర్తుతెలియని వ్యక్తి అకస్మాత్తుగా కనకలక్ష్మి మెడలో ఉన్న 3తులాల బంగారు మంగళసూత్రాన్ని లాక్కొని పారిపోయేందుకు ప్రయత్నించాడు. అప్రమత్తమైన కనకలక్ష్మి, ఆమె భర్త కేకలు వేశారు. దీంతో దొంగ అకస్మాత్తుగా కత్తితో దాడి చేసి అశోక్‌ను తీవ్రంగా గాయపరిచాడు. అడ్డువచ్చిన ఆమెను గట్టిగా నెట్టివేయడంతో ఆమె కూడా కిందపడిపోయింది. అయినా మంగళసూత్రాన్ని ఆమె గట్టిగా పట్టుకోవడంతో మూగ్గురి మధ్యపెనుగులాట జరిగింది. తోటి ప్రయాణికులు ఆమె వద్దకు రావడంతో దొంగ మంగళసూత్రాన్ని వదిలిపెట్టి పారిపోయాడు. విషయం తెలుసుకున్న రైల్వే పోలీసులు స్పందించి భార్య భర్తలను ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు జీఆర్‌పీ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



# వనస్థలిపురం డివిజన్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్

**వనస్థలిపురం, డిసెంబర్ 29 ప్రభాతవార్త:** ఎల్‌బినగర్ నియోజకవర్గంలోని పలు కాలనీలలో వరద నీరు వెళ్లడానికి కోట్లాది రూపాలయతో స్ట్రామ్ వాటర్ డ్రైన్ పనులు చేపడుతున్నామని ఎల్‌బినగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. వనస్థలిపురం డివిజన్‌లోని క్రిస్టియన్ కాలనీ, శ్రీ కృష్ణానగర్ కాలనీలలో రూ. 3కోట్ల 17 లక్షల వ్యయంతో నిర్మించనున్న అభివృద్ధి పనులకు స్థానిక కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో క్రిస్టియన్ కాలనీతోపాటు చుట్టూ ఉన్న కాలనీలు ఎదుర్కుంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని స్ట్రామ్ వాటర్ డ్రైన్ నిర్మాణంతో సమస్య పరిష్కరిస్తున్నామని తెలిపారు.

అదే విధంగా కాలనీలలో ఉన్న ప్రధాన సమస్యలను యుద్ద ప్రాతిపదికన చేపట్టి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూస్తున్నామన్నారు. నిధులు మంజూరుకు పిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, సహకరించిన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డిలకు శ్రీకృష్ణ నగర్ కాలనీ అధ్యక్షుడు కుట్ల నర్సింహ్మాయాదవ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి, టిఆర్ఎస్, బిజెపి డివిజన్ల అధ్యక్షులు చింతల రవికుమార్, నూతి శ్రీనివాసరావు, నాయకులు లగ్గోని శ్రీధర్‌గౌడ్, పివి నర్సింహారావు, దూసరి మధుగౌడ్, గాండ్ల లతాఆనంద్‌రాజ్, కె.సంజయ్‌కుమార్, శ్రీనివాస్‌యాదవ్, రాజునాయి, కాలనీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# పిగ్లీపూర్ భూదాన భూమి అన్యాక్రాంతం కాకుండా రక్షించాలి


భూదాన భూమి ఆక్రమణపై జేసీకి వివరిస్తున్న రవీంద్రాచారి

**హయత్‌నగర్, డిసెంబరు 29 ప్రభాతవార్త:** అబ్దుల్లాపూర్‌మెట్ మండలం పిగ్లీపూర్ గ్రామ సర్వేనెంబరు17లోని 75 ఎకరాల భూదాన భూమిని కబ్జాచేసి వెంచర్ ఏర్పాటుచేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సీపీఐ నాయకులు గురువారం రంగారెడ్డి జిల్లా జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్రాచారి, అబ్దుల్లాపూర్‌మెట్ మండల కార్యదర్శి ముత్యాల యాదిరెడ్డి మాట్లాడుతూ... పిగ్లిపూర్ గ్రామం సర్వే నెంబరు 75లోని వందల కోట్లకు పైగా విలువైన భూదాన భూమిని కొందరు రియల్‌ఎస్టేట్ వ్యాపారులు జేసీబీలతో చదునుచేసి వెంచర్ ఏర్పాటు చేస్తున్నారని ఆర్డీవోకు వివరించారు. 3 నెలల నుంచి పగలు, రాత్రి పనులు కొనసాగిస్తున్నా స్థానిక రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. తమ వంతు వాటాలు తీసుకుని నిమ్మకు నీరెత్తనట్లుగా వ్యవహరిస్తున్నారని వారు ఆరోపించారు. దీంతో కోట్ల విలువైన ప్రభుత్వ, భూదాన భూములు అన్యాక్రాంతమవుతున్నాయని తెలిపారు. వెంటనే స్పందించి క్షేత్రస్థాయి విచారణ జరిపి ప్రభుత్వ, భూదాన భూములను ఆక్రమణల నుంచి స్వాధీనం చేసుకుని అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. వినతి పత్రం సమర్పించిన వారిలో సర్వాసేవాసంఘ్ రంగారెడ్డి జిల్లా కన్వీనర్ పి.సైదులు, నాయకులు శేఖర్‌రెడ్డి, హరిసింగ్ నాయక్ పాల్గొన్నారు.

# మార్కెట్ అభివృద్ధికి కృషి : చైర్‌పర్సన్ అనితానాయక్


అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న అనితానాయక్, దామోదర్

**మలక్‌పేట, డిసెంబర్ 29 ప్రభాతవార్త:** హైదరాబాద్ మార్కెట్ కమిటీ పరిధిలోని అన్ని మార్కెట్లను అధునాతనంగా తీర్చిదిద్ది అభివృద్ధి చేస్తామని హైదరాబాద్ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ అనితానాయక్ పేర్కొన్నారు. మలక్‌పేట మార్కెట్‌లో రూ. 42లక్షలతో షెడ్ నిర్మాణ, రైతు విశ్రాంతి భవనం నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా రైతులు విశ్రాంతి తీసుకునే విధంగా సౌకర్యాలను కల్పించనున్నట్లు తెలిపారు. సుమారు రెండు నెలలో పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తామని పపేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ భూమేష్, ఎస్‌జిఎస్ దామోదర్, డిఇ రవీందర్, డైరెక్టర్లు సల్మాన్‌ఖాన్, ఎజాస్, యాదగిరి, రాముయాదవ్, నరేష్, ప్రవీణ్‌కుమార్, గ్రేడ్ 3 కార్యదర్శి రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్‌కాలనీలో బోరు పనులను ప్రారంభం : ఎమ్మెల్సీ దయానంద్‌గుప్త


బోరు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ దయానంద్‌గుప్తా

**ఎల్.బి.నగర్, డిసెంబర్ 29 ప్రభాతవార్త :** చైతన్యపురి డివిజన్‌మున్సిపల్‌కాలనీలో ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్తా గురువారం బోరు నిర్మాణం పనులను ప్రారంభించారు. కాలనీలో నీటి సమస్యను పరిష్కరించేందుకు తన నిధుల ద్వారా బోరునిర్మాణం పనులు చేపట్టామన్నారు. స్థానిక కాలనీవాసుల ఇబ్బందిని దృష్టిలో పెట్టుకొని బోరు నిర్మాణం పనులను చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శరత్‌చంద్ర, శ్రీహరి, కాలనీ అధ్యక్షుడు నరేష్, చిన్నయాదవ్, పురుషోత్తం పాల్గొన్నారు.

# ఉప్పల్‌లో విద్యుత్ ఉండని ప్రాంతాలు

**ఉప్పల్, డిసెంబరు 29 ప్రభాతవార్త :** ఉప్పల్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కెవి ఐడిఏ ఫీడర్ పరిధిలో శుక్రవారం మరమ్మతులు చేపడుతున్న దృష్ట్యా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఎఇ డి.శ్రీనివాస్ తెలిపారు. ఉప్పల్ ప్రధాన రహదారిలో కొత్త విద్యుత్ లైన్లు వేస్తుండడంతో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, ఉప్పల్ ప్రధాన రహదారి, లక్ష్మారెడ్డికాలనీ, రాఘవేంద్రకాలనీ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 గంటల నుంచి రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

# ఆర్.కెపురంలో మాస్ క్లీనింగ్ డ్రైవ్


మాస్‌క్లీనింగ్ డ్రైవ్‌లో మున్సిపల్ అధికారులతో ఉపేందర్‌రెడ్డి

**నేరేడ్‌మెట్ డిసెంబర్ 29 ప్రభాతవార్త:** మల్కాజిగిరి నియోజకవర్గ పరిధిలోని నేరేడ్‌మెట్ డివిజన్ ఆర్.కె పురంలో గురువారం మాస్ క్లీనింగ్ డ్రైవ్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి సర్కిల్ టిఆర్ఎస్ ఉపాధ్యక్షులు కొత్తపల్లి ఉపేందర్‌రెడ్డిపాల్గొని మున్సిపల్ టీమ్‌తో రోడ్డుపై ఉన్న చెత్తా చెదారాన్ని జెసిబితో తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాస్ క్లీనింగ్ కార్యక్రమం ద్వారా రోడ్డుపైఉన్న చెత్తా చెదారాన్ని తొలగించి పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగాఉంచడం జరుగుతుందన్నారు. మున్సిపల్ సిబ్బంది డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో మాస్ క్లీనింగ్ డ్రైవ్‌లను నిర్వహిస్తే బాగుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉపేందర్‌రెడ్డి, నాగరాజు, హైమద్, నరేందర్ రెడ్డి, శివ, పద్మ కాలనీ అధ్యక్షులు మహాపాత్ర, రాజు కాలనీ సభ్యులు పాల్గొన్నారు.

# నాయి బ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి కృషి : ముద్దగౌని


రామ్మోహన్‌గౌడ్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న నాయిబ్రాహ్మణులు

**ఎల్.బి.నగర్, డిసెంబర్ 29 ప్రభాతవార్త:** నాయి బ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తానని ఎల్బీనగర్ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ ముద్దగౌని రామ్మోహన్‌గౌడ్ పేర్కొన్నారు. తెలంగాణ నాయి బ్రాహ్మణ, క్షౌరావృత్తిదారుల ఐక్యవేదికఆధ్వర్యంలో చైతన్యపురిలో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని గురువారం ముద్దగోనికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాయి బ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారం తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో క్షౌర వృత్తిదారుల ప్రతినిధులు మంకాల సుధాకర్, చెన్నారం మల్లేష్, గొలనుకొండ అశోక్, శ్రీనివాస్, రాము, కిరణ్, యాదయ్య, చింతల శ్రీను, కిరణ్‌కుమార్, నరేందర్, దశరథ, పార్వతయ్య, చందర్ పాల్గొన్నారు.

# గౌతమ్‌నగర్‌లో జన్ ఔషధీ కేంద్రం ప్రారంభం


జన ఔషధి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మురళీధర్‌రావు

**మల్కాజిగిరి, డిసెంబర్ 29 ప్రభాతవార్త:** బిజెపి రాష్ట్ర కన్వీనర్ ఎక్స్ సర్వీస్ మెన్ సెల్ గోపు రమణారెడ్డి ఆధ్వర్యంలో 24వ జన్ ఔషధీ కేంద్రాన్ని బిజెపి సీనియర్ నాయకులు, మధ్యప్రదేశ్ ఇంచార్జ్ మురళీధర్ రావు ప్రారంభించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ ప్రధాని మోడీ తీసుకువచ్చిన అనేక పథకాలలో ప్రజలందరికీ ఉపయోగపడే వైద్యం, మందుల మీద విపరీతమైన భారం పడుతుందని తెలిసి డబ్బులను ఆదా చేయటానికి ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉండటానికి ప్రధానమంత్రి భారతీయ జన ఔషధ పరియోజన స్కీం తీసుకువచ్చారన్నారు. ఇన్ని కేంద్రాలు ఏర్పాటు చేసి సేవలందిస్తున్న రమణారెడ్డి దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో బిజెపి మల్కాజ్‌గిరి కన్వీనర్ సదానంద గౌడ్, నాయకులు లక్ష్మణ్, శ్రీనివాస్‌ముదిరాజ్. చందు, బొక్క నాగరాజు, డిన్ సింగ్, అవాదేస్ మిశ్రా, అబిమన్యు, సునీత, సుశీల తదితరులు పాల్గొన్నారు.

# హయత్‌నగర్ పిఎస్‌కు 12వ ర్యాంకు


సీపీ నుంచి ప్రశాంసా పత్రం అందుకుంటున్న సీఐ వెంకటేశ్వర్లు

**హయత్‌నగర్, డిసెంబరు 29 ప్రభాతవార్త:** 2023 సంవత్సరానికి తెలంగాణ రాష్ట్రంలో హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ 12వ ఉత్తమ పోలీస్‌స్టేషన్‌గా ఎంపికైంది. ఈమేరకు బుధవారం రాచకొండ కమిషనర్ మహేష్‌భగవత్ చేతుల మీదుగా హయత్‌నగర్ ఇన్‌స్పెక్టక్ వెంకటేశ్వర్లు ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. ఈసందర్భగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ... మెరుగైన పరితీరుతో సిబ్బంది సహకారంతో మరింత ఉత్తమ ర్యాంకు సాధనకు కృషిచేస్తామన్నారు.

# డిప్యూటీ తహసీల్దార్ బాలకృష్ణ మృతికి సంతాపం : సత్తయ్య

**తుర్కయాంజాల్, డిసెంబరు 29 ప్రభాతవార్త :** ఇబ్రహీంపట్నం డిప్యూటీ తహసీల్దార్ బాలకృష్ణ ఆకస్మిక మృతి పట్ల డీసీసీబీ వైస్ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య తీవ్రగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాలకృష్ణ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. బాలకృష్ణ రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లో మంచి పేరు తెచ్చుకున్నారని ఆయన చిన్న వయసులోనే రోడ్డు ప్రమాదంలో మృతిచెందడం బాధాకరమన్నారు.

# కేదారకంట శిఖరాన్ని అధిరోహించిన కొండ యాదగిరి


జాతీయ జండాను ప్రదర్శిస్తున్న యాదగిరి

**సైదాబాద్, డిసెంబరు 29 ప్రభాతవార్త:** ఉత్తరఖండ్‌లోని 12,500 ఫీట్ల ఎత్తైన కేదారకంట శిఖరాన్ని చంపాపేటకు చెందిన బిఆర్ఎస్ నాయకుడు, బిసి సంక్షేమసంఘం రాష్ట్ర కార్యదర్శి కొండ యాదగిరి అధిరోహించి రికార్డు సృష్టించాడు. శిఖరంపై జాతీయ జండాను, బిఆర్ఎస్‌జండాను ఎగురవేయడంతో పాటు సిఎం కెసిఆర్, మంత్రి కెటిఆర్ చిత్రపటాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ మైనస్ 11 డిగ్రీల ఉష్ణోగ్రత వద్ద శిఖరాన్ని అధిరోహించడం జరిగిందన్నారు. బిఆర్ఎస్ దేశ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించాలన్న ఆకాంక్షతో బిఆర్ఎస్ జండాను కేదారకంట శిఖరంపై ఎగుర వేయడం జరిగిందన్నారు.

# ఇంటింటికి మంచినీటి పైప్ లైన్ పనులు


పైప్‌లైన్ పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ గీత తదితరులు

**ఉప్పల్, డిసెంబరు 29 ప్రభాతవార్త :** చిలుకానగర్‌లోని ప్రతి ఇంటికి స్వచ్ఛమైన మంచినీటిని అందించేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం డివిజన్ పరిధిలోని న్యూ రాంనగర్‌కాలనీలోని నలంద స్కూల్ లైన్‌లో మంచి నీటి పైప్‌లైన్ పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రతి ఇంటికి మంచినీటి పైప్‌లైన్లు వేయిస్తున్నామన్నారు. గత పది సంవత్సరాలుగా మంచినీటి పైప్‌లైన్లు సరిగ్గా లేక ఇబ్బందులు పడ్డారని, ఇక నుంచి సమస్య పూర్తిస్థాయిలో పరిష్కారమవుతుందన్నారు. ప్రజలకు మౌళిక సదుపాయాలు కల్పించేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు బన్నాల ప్రవీణ్‌ముదిరాజ్, ఏదుల కొండల్‌రెడ్డి, కార్యదర్శి కె.జగన్, సకినాల ప్రసాద్, రామానుజం, ప్రసాద్‌చారి, బాలు, శ్యామ్, కాలనీ నేతలు రామకృష్ణ, అరిప్, రహమాన్, శ్రీశైలం, బాలరాజు, మాధవి తదితరులు పాల్గొన్నారు.

# కృష్ణానగర్‌లోని సమస్యల పరిష్కారానికి కృషి: మధుకర్‌రెడ్డి


కాలనీలో పర్యటిస్తున్న మధుకర్‌రెడ్డి

**సైదాబాద్, డిసెంబరు 29 ప్రభాతవార్త:** ఐఎస్‌సదన్ డివిజన్‌లోని సమస్యల పరిష్కారానికి ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామని బిజెపి భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని కృష్ణానగర్‌లో కాలనీవాసులతో కలిసి పర్యటించి స్థానిక సమస్యలను పరిశీలించారు. ధ్వంసమైన మ్యాన్‌హోల్స్‌కు మరమ్మత్తు పనులు చేపట్టాలని, రోడ్లపై నీరు నిల్వకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జైపాల్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, చెన్నయ్యచారి, విజయ్, శ్రీనివాసులు, వెంకటాచారి, శరత్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.

# ఢిల్లీలో జరిగే గణతంత్ర దినోత్సవ శిబిరానికి హయత్‌నగర్ డిగ్రీ కళాశాల విద్యార్థి ఎంపిక

**హయత్‌నగర్, డిసెంబరు 29 ప్రభాతవార్త:** హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీకాం 2వ సంవత్సరం చదువుతున్న ఎన్.సి.సి క్యాడెట్ ఎ.తిరుపతి ఢిల్లీలో జరిగే 74వ గణతంత్ర శిబిరానికి ఎంపికయినట్లు ప్రిన్సిపల్ డా.జోత్స్న ప్రభ తెలిపారు. డైరెక్టర్ జనరల్ ఎన్.సి.సి ఢిల్లీ ఆధ్వర్యంలో జరుగనున్న క్యాంపులో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎన్.సి.సి డైరెక్టరేట్ నుంచి 120 మంది క్యాడెట్స్ పాల్గొననున్నట్లు ఆమె వివరించారు. ఈ ఏడాది డిసెంబరు 30 నుంచి వచ్చే ఏడాది జనవరి 29 వరకు నెలరోజుల పాటు క్యాంపు కొనసాగుతుందన్నారు. ప్రధానికి ఇచ్చే గౌరవ వందనంతో పాటు పీఎం ర్యాలీలో తిరుపతి పాల్గొంటాడని ఎన్.సి.సి విభాగం ఆఫీసర్ సబ్ లెఫ్టినెంట్ డా. ధన్‌రాజ్ వివరించారు. ఈ సందర్భంగా తిరుపతిని అభినందించారు.

# రాంశంకర్‌నగర్‌లో సివరేజీ పైప్ లైన్ పనులు : బండారు శ్రీవాణి


సివరేజీ పైప్‌లైన్ పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రీవాణి

**రామంతాపూర్, డిసెంబరు 29 ప్రభాతవార్త :** రామంతాపూర్ రాంశంకర్‌నగర్ పరిసర ప్రాంతాల్లో గోఖలేనగర్, ఎండోమెంట్‌కాలనీ నుంచి వస్తున్న మురుగునీటి సమస్యకు పూర్తి స్థాయిలో పరిష్కారం చేస్తున్నట్లు స్థానిక కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్రావ్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం రాంశంకనగర్, గోఖలేనగర్, ఎండోమెంట్‌కాలనీ మీదుగా వేస్తున్న పైప్‌లైన్ పనులను ఆమె పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ గతంలో ఉన్న పైప్‌లైన్ పనులు మార్చివేసి ప్రజలకు అనుగుణంగా కొత్త పైప్‌లైన్ పనులు వేయిస్తున్నామన్నారు. ప్రజలకు ఇబ్బంది కాకుండా పనులు పూర్తి చేయాలని సూచించారు. జలమండలి అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జలమండలి మేనేజర్ రవీందర్, సూపర్‌వైజర్ కిషన్, బిజెపి డివిజన్ అధ్యక్షుడు బండారు వెంకట్రావ్, పడిగం నగేష్ తదితరులు పాల్గొన్నారు.

# చిరువ్యాపారులకు చేయూత అందిస్తాం : ఎమ్మెల్యే బేతి


ఎమ్మెల్యే బేతిని కలిసి సమస్యలు విన్నవిస్తున్న వ్యాపారులు

**ఉప్పల్, డిసెంబరు 29 ప్రభాతవార్త :** ఉప్పల్ నియోజకవర్గం పరిధిలో రోడ్లపై పండ్లు, కూరగాయలు విక్రయించే వ్యాపారులకు చేయూత అందిస్తామని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఉప్పల్ నల్ల చెరువు కట్ట సమీపంలోని పండ్లు విక్రయించే చిరు వ్యాపారులు ఎమ్మెల్యే బేతిని కలిసి పలు సమస్యలు విన్నవించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రోడ్లపై పండ్లు విక్రయించే వ్యాపారులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా తగు చర్యలు తీసుకుంటున్నామని, వ్యాపారుల సమస్యలు పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షుడు వేముల సంతోష్‌రెడ్డి, అరటికాయల వంశీ, భరత్‌రెడ్డి, శివ, నాగూర్‌బాషా పలువురు పండ్ల వ్యాపారులు పాల్గొన్నారు.

# అయ్యప్ప భక్తులకు అన్నప్రసాదం


స్వాములకు అన్నప్రసాదం అందజేస్తున్న చైర్మన్ దామోదర్‌గుప్తా, ఉపేందర్‌గుప్తా

**ఎల్.బి.నగర్, డిసెంబర్ 29 ప్రభాతవార్త:** కొత్తపేటలోని శ్రీకన్యకా పరమేశ్వరి దేవాలయంలో మొగుళ్ళపల్లి యువసేన ఉపేందర్ గురుస్వామి అధ్వర్యంలో అయ్యప్పస్వామి భక్తులకు గత 12సం నుండి నిత్య అన్నప్రసాద కార్యక్రమం నిర్వహిస్తుండగా గురువారం తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కొలేటి దామోదర్‌గుప్తా హాజరై అయ్యప్పస్వామి భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డించారు. 39వ రోజు అన్న ప్రసాద కార్యక్రమంలో పాల్గొని స్వాములకు వడ్డించి స్వాములతొ సహాపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో గురుస్వామి డాక్టర్ మొగుళ్ళపల్లి ఉపెందర్‌గుప్తా, యువసేన అద్యక్షుడు చొప్పవరపు పవన్, రాఘవరెడ్డి, బొడ్లా సత్యనారాయణ, మదు, సాయిమనోజ్, తదితరులు పాల్గొన్నారు.

# కొత్త ఫ్లైఓవర్ నిర్వాసితులకు న్యాయం చేయాలని వినతి


జిహెచ్ఎంసి చీఫ్ సిటిప్లానర్ దేవేందర్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న నాగోల్ ఫ్లైఓవర్ బాధితులు

**ఉప్పల్, డిసెంబరు 29 ప్రభాతవార్త :** ఉప్పల్ రింగ్‌రోడ్ నుంచి నాగోల్ వైపు నిర్మించతలపెట్టిన కొత్త ఫ్లైఓవర్ కోసం రోడ్డు విస్తరణ నోటీసులు తీసుకున్న బాధితులకు తమకు న్యాయం చేయాలని గురువారం జిహెచ్ఎంసి చీఫ్ సిటి ప్లానర్ దేవేందర్‌రెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో భూనిర్వాసితులు మేకల మధుసూధన్‌రెడ్డి, చర్ల రాంరెడ్డి, సుధాకర్‌రెడ్డి, ఆదిత్యరెడ్డి, లక్ష్మారెడ్డి, కిషోర్, రామకృష్ణారెడ్డి, పరమేశ్వర్, రమేష్ తదితరులు సిటిప్లానర్‌ను కలిసి తమ సమస్యలు విన్నవించారు. నాగోల్ రోడ్డులో ఇప్పటికే రోడ్డు విస్తరణ కోసం తమ స్థలాలు తీసుకోవడం వల్ల తీవ్రంగా నష్టపోయామని, మరోసారి విస్తరణ చేయడం వల్ల ఇబ్బందులు వస్తాయని వారు విన్నవించారు. 24 మంది భవన యజమానులకు నోటీసులు ఇచ్చారని, తమకు న్యాయం చేయాలని వారు విన్నవించారు. దీనిపై త్వరలోనే మంత్రి కేటీఆర్‌ను కలిసి విన్నవిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు భవన యజమానులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ పెన్షన్లు అందేలా చూడాలి : కందాల బలదేవరెడ్డి


ఆర్ఐ నగేష్‌కు పెన్షన్ దరఖాస్తులను అందజేస్తున్న దృశ్యం

**తుర్కయంజాల్, డిసెంబర్ 29 ప్రభాతవార్త:** అర్హులైన వృద్ధులు, వితంతులు, ఒంటరి మహిళలకు పెన్షన్లు ఇచ్చి ఆదుకోవాలని రైతుబంధు కోఆర్డినేటర్ కందాల బలదేవరెడ్డి ఆధ్వర్యంలో కోహెడకు చెందిన సుమారు 100మంది అర్హులు తుర్కయంజాల్ మున్సిపల్ ఆఫీసులో ఆర్ఐ నగేష్‌కు దరఖాస్తులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ సర్కార్ ఎంతో ముందుచూపుతో వృద్ధులు, వితంతులు, ఒంటరి మహిళలకు పించన్లు ఇస్తూ ఆదుకుంటోందన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి పెన్షన్లు అందేలా చూడాలని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలను లబ్దిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కోహెడ మాజీ ఉపసర్పంచ్ కందాల బిందు రంగారెడ్డి, నాయకులు బుడ్డ విజయ్‌బాబు, పల్లపు ఆంజనేయులు, గంగని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# మాణికేశ్వరీనగర్ బస్తీ నుంచి శబరికి వెళ్లిన అయ్యప్పస్వాములు

**తార్నాక, డిసెంబర్ 29 ప్రభాతవార్త:** అయ్యప్ప మాలలు ధరించి 41 రోజుల పాటు నిష్టతో దీక్ష చేసిన పలువురు అయ్యప్ప స్వాములు మాణికేశ్వరీనగర్ బస్తీ నుంచి పలువురు శబరికి గురువారం తరలివెళ్లారు. మాణికేశ్వరీనగర్ బస్తీ ఏడు గుళ్ల దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసి ఇరుముడి కట్టుకున్న స్వాములు శబరికి బయలు దేరి వెళ్లారు. టీడీపీ సికింద్రాబాద్ నియోజకవర్గం ఇంచార్జి వల్లారపు శ్రీనివాస్ కుమార్ యాత్రను ప్రారంభించారు. యాత్రకు వెళ్లిన వారిలో డివిజన్ అధ్యక్షులు గురుస్వామి గండికోట విజయ్‌కుమార్, రవికుమార్, కాత విజయ్‌కుమార్, గరిగే ప్రవీణ్‌కుమార్, జీఎం రమేష్, మురళి కృష్ణ, నవీన్, శివ, చిరంజీవి, గోపి, బబ్లూ, దేవా, రామ్‌చరణ్, రవి, రోహిత్, చంద్రమోహన్, నరసింహ్మ, రాజు, రామ్మోహన్ తధితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్రంలోనే ఉప్పల్ పోలీస్ స్టేషన్‌కు ఫస్ట్ ర్యాంక్


డిజిపి మహేందర్‌రెడ్డి నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న ఉప్పల్ సిఐ ఆర్.గోవిందరెడ్డి తదితరులు

**ఉప్పల్, డిసెంబరు 29 ప్రభాతవార్త :** తెలంగాణలోనే ఉప్పల్ పోలీస్‌స్టేషన్ మొదటి ర్యాంక్ సాధించింది. నేరాల అదుపు, కేసుల పరిష్కారం తదితర విభాగాలలో ప్రతిభ కనబర్చిన ఉప్పల్ సిఐ ఆర్.గోవిందరెడ్డికి గురువారం రాష్ట్ర డిజిపి మహేందర్‌రెడ్డి, రాచకొండ సిపి మహేష్‌భగవత్‌ల నుంచి ప్రశంసా పత్రం స్వీకరించారు. వార్షిక పనితీరు, కేసుల నివారణ, కేసులచేదింపు, పరిశోధన, నేరారోపణలు, డయల్ 100కు ప్రతిస్పందన, పౌరుల నుంచి ఫీడ్‌బ్యాక్, స్టేషన్ మేనేజ్‌మెంట్, హెచ్‌ఆర్ఎంఎస్, వర్క్ ప్లేస్ మేనేజ్‌మెంట్, ట్రైనింగ్, పోలీస్ వర్క్ ప్రాసెస్, డిజిటలైజేషన్, నేరాలను నివారించడం తదితర అంశాలను ఐదు వర్గాలుగా విభవించి అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా డిజిపి కార్యాలయంలో జరిగిన సమావేశంలో డిజిపి మహేందర్‌రెడ్డి, సిపి మహేష్‌భగవత్ ఉప్పల్ సిఐ గోవిందరెడ్డిని సన్మానించి అభినందించారు. పోలీస్‌స్టేషన్ ఎస్ఐలు డి.వెంకట్‌రెడ్డి, ఎస్.వి.రమేష్, ఎఎస్ఐ బి.హనుమనాయక్, పిసి బి. శ్రవణ్ కుమార్, డబ్ల్యుపిసి కె.విజయ, హెడ్‌కానిస్టేబుల్ జి.పురుషోత్తం, పిసిలు ఆర్.కిరణ్‌కుమార్, ఎస్ఐ ఎస్.కోటేశ్వర్‌రావు, పిసి బి.వెంకటేష్, ఎస్.రఘురామ్, డి.భాస్కర్, హెచ్‌సి పి.రాములు, డబ్ల్యుపిసి అశ్వినిలు అత్యుత్తమ పనితీరు కనబరిచినట్లు అధికారులు తెలిపారు.

# బిజెపి ఓబిసి మోర్చా రాష్ట్ర మీడియా ఇంఛార్జిగా లింగాల హరిగౌడ్


నియామక పత్రం అందుకుంటున్న హరిగౌడ్

**సైదాబాద్, డిసెంబరు 29 ప్రభాతవార్త:** బిజెపి ఓబిసి మోర్చా రాష్ట్ర మీడియా ఇంఛార్జిగా మలక్‌పేట నియోజకవర్గానికి చెందిన లింగాల హరిగౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు హరిగౌడ్‌కు ఓబిసి మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు భాస్కర్ రాజ్, మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్ సమక్షంలో నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా హరిగౌడ్ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు పోరాటం చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా బిజెపిని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తానన్నారు. రాబోయే ఎన్నికల్లో తెలంగాణాలో బిజెపి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. టిఆర్ఎస్ కుటుంబ, నియంతృత్వ పాలనతో ప్రజలు విసిగి పోయారని, మార్పు కోరుకుంటున్నారని, ప్రధాని మోడి నేతృత్వంలోని డబల్ ఇంజన్ సర్కార్ తెలంగాణాలో కూడా వస్తుందన్నారు.

# రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరవు : గీతామూర్తి


సమావేశంలో పాల్గొన్న గీతామూర్తి, భాగ్యలక్ష్మి తదితరులు

**మలక్‌పేట, డిసెంబర్ 29 ప్రభాతవార్త:** రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరవైందని బిజెపి రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు గీతామూర్తి పేర్కొన్నారు. మూసారాంబాగ్ బిజెపి జిల్లా కార్యాలయంలో భాగ్యనగర్ జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు దశరథలక్ష్మిఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గీతామూర్తి, భాగ్యనగర్‌జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్‌జీ, మూసారాంబాగ్, సైదాబాద్ డివిజన్ల కార్పొరేటర్లు బొక్క భాగ్యలక్ష్మి, కొత్తకాపు అరుణ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సారాయి దందాలో ఉన్న ఉత్సాహం, మహిళలకు రక్షణ, రాష్ట్ర అభివృద్ధి విషయంలో కనిపించడం లేదన్నారు. రానున్న రోజుల్లో బిజెపి గెలుపు కోసం మహిళలు, నాయకులు, కార్యకర్తలు కృషి చేస్తారన్నారు. పాత బస్తీలో అభివృద్ధి కొరవడిందని వచ్చే ఎన్నికలలో నియోజకవర్గాలను బిజెపి కైవసం చేసుకొని రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ప్రధాని మోడికి బహుమతిగా ఇవ్వడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మంజులారెడ్డి, కార్యదర్శులు తులసి, కావేటి లక్ష్మి, స్వప్న, గాయత్రి, అంబాబాయి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

# వాసవి క్లబ్ వనస్థలిపురం నూతన కార్యవర్గ ఎన్నిక


సమావేశంలో మాట్లాడుతూ వాసవి క్లబ్ ప్రతినిధులు

**వనస్థలిపురం, డిసెంబర్ 29 ప్రభాతవార్త:** వనస్థలిపురం వాసవి క్లబ్ 2023 సంవత్సరానికి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. వాసవి క్లబ్ వనస్థలిపురం ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశంలో నూతన అధ్యక్షుడిగా ఎం.శివ నాగేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శిగా స్వామి అచ్యుతరావు, కోశాధికారిగా కుమారస్వామిలను ఎన్నుకోవడం జరిగింది. అంతకు ముందు వాసవి క్లబ్ అధ్యక్షుడు ఆర్.శ్యాంసుందర్‌రావు, ప్రధాన కార్యదర్శి శివనాగేశ్వర్‌రావు, కోశాధికారి పి.రాజేందర్‌లు 2022 సంవత్సరానికి సంబంధించిన అకౌంట్స్‌ను సభ్యులందరి సమక్షంలో ఆమోదించడం జరిగిఆఅంది. ఈ సమావేశంలో ఇంటర్‌నేషనల్ ఉపాధ్యక్షుడు విట్టా దూరయ్య, డిస్ట్రిక్ గవర్నర్ మర్యాల చంద్రమౌళిగుప్త, కో ఆర్డినేటర్ కొత్త మాసు రమేష్, రీజినల్ సెక్రటరీ అత్తులూరి మల్లికార్జున రావు, అల్లాడి పరమేశ్వర్, వి.బి.గాంధీ, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.